ఆరె కటికల మహాసభను జయప్రదం చేయాలి

బన్సీలాల్‌పేట, మార్చి 10: ఆరె కటిక హక్కుల కోసం నిర్వహించనున్న మహా సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్ ప్రకటనలో కోరారు. మంగళవారం (నేడు) నగరంలోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఆరె కటికలను బీసీడీ నుంచి బీసీఏ గ్రూపులో కలుపుతూ జీవో తీసుకురావాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం దుకాణాల టెండర్లలో ఆరె కటిక కులస్తులకు 30శాతం రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర తెలంగాణలో వీడీసీల దౌర్జన్యాన్ని అరికట్టాలని, దీనిపై ప్రత్యేక జీవో తీసుకువాలని డిమాండ్ చేశారు. నేటి మహా సభకు వేలాదిగా ఆరె కటికలు తరలి రావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌కు 20 లక్షలు మంజూరు

కవాడిగూడ, మార్చి 10: భోలక్‌పూర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ తెలిపారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను సోమవారం కలిసి ఇందిరానగర్ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ పదేండ్లుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక గదిని నిర్మించాలన్నారు. అధ్వాన్నంగా మారిన రోడ్లను ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో డీఈ సన్నీ, నాయకుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.

సంక్షేమం.. కేసీఆర్ అందించిన వరం

● కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 10: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదింటి ఆడపడుచులకు కేసీఆర్ అందించిన వరం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తహసీల్దార్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను రూపొందించి లబ్ధిదారులకు నిరాటంకంగా అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 141 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అందులో 44 కల్యాణలక్ష్మి, 97 షాదీముబారక్ చెక్కులు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ముఠా జయసింహ, కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధరాచార్యులు, శివముదిరాజ్, మాదవ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, గోరక్‌నాథ్, శ్రీనివాస్ గుప్తా, అస్లాం, జమాలుద్దీన్, రవియాదవ్, శివ, మహ్మద్‌అలీ, కాంగ్రెస్ నాయకులు అరవింద్‌కుమార్ యాదవ్, భాస్కర్, అంజియాదవ్, శ్రీనివాస్, లక్ష్మణ్, చంద్రశేఖర్, కృష్ణ , రాము, మల్లేష్, ప్రభాకర్, బాబు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే తలసానిని కలిసిన హమాలీ బస్తీవాసులు

బన్సీలాల్‌పేట్, మార్చి 10: పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం బస్తీ నాయకులు ఆయనను కలిశారు. ఇటీవల మహాశివరాత్రి రోజున స్థానిక శివాలయానికి వచ్చిన సందర్భంలో ఆలయ పరిసరాల్లో ఫ్లోరింగ్ పాడైందని తాము ఆయనకు ఫిర్యాదు చేశామని అన్నారు. దీంతో స్పందించిన వెంటనే రూ.8లక్షల 50 వేల నిధులను మంజూరు చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆ నిధులతో రెండు ఆలయాల చుట్టూ సీసీరోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని, తద్వారా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హమాలీ బస్తీ అధ్యక్షుడు సుభాష్, యాదగిరి, కుశాల్, సత్యనారాయణ, సంపత్ తదితరులు ఉన్నారు.

నాగార్జున నగర్ కాలనీలో పుస్తక ప్రదర్శన

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొఫెసర్ తిరుపతిరావు

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక డివిజన్ నాగార్జుననగర్ కాలనీలో సోమవారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ లక్కరాజు నిర్మల రచించిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సాహిత్య ప్రతిభా మూర్తి మధునాపంతుల

సభలో మాట్లాడుతున్న కోలేటి దామోదర్ గుప్తా

ముషీరాబాద్, మార్చి 10: తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కవుల్లో ప్రముఖుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిఅని పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. సంప్రదాయ సాహిత్య ప్రతిభా మూర్తి అని కొనియాడారు. త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాహిత్యవేత్త సత్యనారాయణ శాస్త్రి సంస్మరణ సభ జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దనామూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక సంప్రదాయ పద్య కవుల్లో ప్రతిభ, అభ్యాసం, సమపాళ్లలో సముపార్జించిన మహాకవిగా అభివర్ణించారు. ఆయన రచించిన ఆంధ్ర పురాణం కావ్యంలో విశ్వనాథ వారి కవితా ధార, కరుణశ్రీ వంటి కవుల శైలి లాలిత్యం పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, వెంకటేశ్వర్‌రావు, గాయని గరిమెళ్ళ సీత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దాసోజు శ్రవణ్‌కు శుభాకాంక్షలు

దాసోజు శ్రావణ్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ..

చిక్కడపల్లి, మార్చి 10: అసెంబ్లీ హాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన డాక్టర్ దాసోజు శ్రావణ్‌కు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చ కుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ కలిసి అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ నేతృత్వంలో సోమవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు కళ్యాణ్ నాయక్ మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కళ్యాణ్‌నాయక్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ అభినందించారు.

కళ్యాణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్న అని అన్నారు. – చిక్కడపల్లి, మార్చి 10

'గ్లకోమా' అవగాహన వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాల్లో పాల్గొన్న మోటిలాల్ నాయక్, గోవింద హరి, డాక్టర్ షబానా భారతి

మారేడ్‌పల్లి, మార్చి 10: సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రిలో సోమవారం 'గ్లకోమా' (నీటి కాసుల వ్యాధి) అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వ ఎన్‌పీసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోటిలాల్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్లకోమా కారణంగా అంధత్వాన్ని నివారించడానికి పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 15 వరకు గ్లకోమా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ షబానా భారతి, వైద్యశాల చైర్మన్ గోవింద హరి వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కారు బ్లాక్ ఫిలింను తొలగిస్తున్న సిబ్బంది

బొల్లారం, మార్చి 10: వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు అన్నారు. సోమవారం బొల్లారం చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింలు, సైరన్లను హారన్లుగా వాడుతున్న వాహనదారులపై చర్యలు తీసుకొని తొలగించారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసులు సైతం నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, జయంతి, హెడ్ కానిస్టేబుల్ దీను ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థిక సహాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, మార్చి 10: గాంధీనగర్ డివిజన్‌ఉల్లి గడ్డ బస్తీవాసి కె.శ్రీనివాస్ కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై, ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని శ్రీనివాస్ తండ్రి కె.భూమయ్య, భార్య కె.సుజాతను పరామర్శించారు. చికిత్స వివరాలను తెలుసుకొని, వారికి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు ఎ.వినయ్‌కుమార్, వి.నవీన్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్‌రావు, లక్ష్మినారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 6: సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏ డి ఈ వినోద్ కుమార్ తెలిపారు. ఇందిరా పార్క్ సబ్ స్టేషన్ పరిధిలో 12 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గగన్ మహల్ ప్రాంతంలోని లోయర్ ట్యాంక్ బండ్ ,గగన్ మహల్ కాలనీ, సాధురామ్ కంటి ఆసుపత్రి ప్రాంతం, బాదం గల్లీ, భారత్ స్కాట్స్, గ్యాస్ గోడౌన్, దోమల్‌గూడ మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 నుచి 3.30 వరకు రామకృష్ణ మఠం,అరవింద్ నగర్ ,ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా రిలయన్స్ టవర్స్, అరవింద్ నగర్ , గణేష్ టెంపుల్ ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఆర్భాటాల కోసం పథకాలు ఆచరణలో శూన్యం ప్రొఫెసర్ సుధారాణి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

హిమాయత్ నగర్,మార్చి 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను ఆర్భాటం కోసం ప్రకటిస్తున్నారే తప్ప ఆచరణలో ఏ మాత్రం అమలు కావడం లేదని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి . ప్రేంపావని, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రజినీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, నగర ఎస్. ఛాయాదేవి ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో మహిళల వాటా ఎంత అనే అంశంపై సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్‌రెడ్డి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసమంటూ బడ్జెట్‌ను కేటాయించి వాటిపై ఏరకమైన సమీక్ష చేసి సంక్షేమ పథకాల ఫలాలను మహిళలకు ప్రభుత్వాలు అందించడంలేదని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా మహిళలపై వేధింపులు, దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని నిలువరించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ నాయకురాలు నళిని, ఫమీదా, హైమావతి, అరుణ, కళమ్మ, చందన, సుజాత, విజయ, లక్ష్మి, దేవమ్మ పాల్గొన్నారు.

ఓటమి విజయానికి పునాది: మంత్రి సీతక్క

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఉస్మానియా యూనివర్సిటీ: ఓటమిని ప్రతి మహిళ తమ విజయాలకు పునాదిగా చేసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. కృషి, పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదన్నారు. పట్టుదల, కృషి, జ్ఞానాన్ని నమ్ముకున్న వాళ్లు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. అందుకు తానే పెద్ద ఉదాహరణ అని అన్నారు. ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఫర్ వుమెన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కష్టాలను చూసి ఎవరూ కుమిలిపోవద్దన్నారు. వాటిని ఇష్టంగా మలుచుకోవడం ప్రతి ఆడపిల్ల నేర్చుకోవాలని అన్నారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టేందుకు సిలబస్‌లో కొత్త పాఠ్యాంశాలను చేర్చుతామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సమానంగా పెంచాలని సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఆర్టీసీ అద్దె బస్సుల విధానం తీసుకొచ్చిందన్నారు. దీని ద్వారా మహిళలు బస్సులకు ఓనర్లుగా మారుతున్నారని చెప్పారు. ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ పి. రజిని మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు.. ఒక వైపు కుటుంబం, మరోవైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. పని ఒత్తిడి మహిళలపై పెరిగిందన్నారు. ప్రతి ఆడపిల్ల చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కరుణా దేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వసుంధర, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.ప్రమీల, అధ్యాపకులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకంపెరిగేలా సేవలందించాలి వైద్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటి

కవాడిగూడ, మార్చి 10:ప్రభుత్వ వాసుపత్రుల్లో అందించే వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగేలా ఆశావర్కర్లు కృషిచేయాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంక టి సూచించారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో సోమవారం ఆశావర్కర్లు, వైద్యసిబ్బందితో డార్టర్ వెంకటి వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా డక్టర్ వెంకటి మాట్లాడుతూ ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారిని, గర్భిణీ మహిళలను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రిలో ఓపీ సేవలను పెంచాలని సూచించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీకి త్వరలోనే కొత్త డాక్టర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌ఓలు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో వైద్యవృత్తికి ప్రత్యేకమైన స్థానం

డాక్టర్లు, ఆశ వర్కర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకురాలు గీతాదయాకర్, తదితరులు

అడ్డగుట్ట, మార్చి 10: మెట్టుగూడ ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఆశ వర్కర్లతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తికి ప్రత్యేకమైన స్థానం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు పవన్‌కుమార్, కవితతో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శాంతినగర్ లో ఘనంగా..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినగర్లో బీఆర్ఎస్ సీనియర్ నేత గీతాదయాకర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్యులు, టీచర్లు, సంఘ సేవకులు, బ్యూటీషియన్స్‌తో పాటు సమాజంలో వివిధ ఉద్యోగాలు, విధులను నిర్వహిస్తున్న వారిని ఘనంగా సత్కరించినట్లు ఆమె తెలిపారు.

ముగ్గురు యువతులకు రెండు రోజుల జైలు

ఖైరతాబాద్, మార్చి 10: బహిరంగ ప్రదేశాల్లో వచ్చి పోయే వారిని ఆకర్షించేందుకు అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు యువతలకు జైలు శిక్ష పడింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఇందిరా నగర్ కు చెందిన జె. వైశువేద (22), నజీరా బేగం (21), కె.శాన్విక (20)లు నిమ్స్ బస్‌స్టాండ్ వద్ద నిలబడి వచ్చిపోయే వారిని ఆకర్షిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పంజాగుట్ట పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

రోడ్డును తవ్వి.. మరమ్మతులు మరిచి

ముషీరాబాద్ మార్చి 10.. ముషీరాబాద్ సాగర్ లాల్ ఆసుపత్రి వద్ద రోడ్డును తవి గత నెల రోజులుగా పట్టించుకోక పోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. తవ్విన రోడ్డు కారణంగా దుమ్ము ధూళి ఎగిసిపడటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ముషీరాబాద్ దాయర మార్కెట్= సాగర్ లాల్ ఆసుపత్రి మార్గంలో రెండు నెలల క్రితం జలమండలి 1000 ఎంఎం డయా సామర్థ్యం కలిగిన మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేసి రోడ్డు చదును చేసి వదిలేసారు. తవ్విన రోడ్డు కారణంగా దాదాపు అర కిలోమీటర్ మేర దుమ్ముతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడంత గుంతలు మాయంగా తయారై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపామని చెప్తున్నారు.

గుంతలమయంగా తయారైన సాగర్‌లాల్ ఆసుపత్రి రోడ్డు